క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మ వారికి అభిషేకాలు, అర్చనలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించారు. నైవేద్యం సమ ర్పించి హారతులు పట్టారు. అనంతరం భక్తుల కు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేద విశ్వ బ్రాహ్మణులకు సహాయం



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలోని పేద విశ్వ బ్రాహ్మణులను గుర్తించి వారికి ఆర్థికంగా, వైద్య పరంగా సహాయం చేస్తామని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మదనమోహనచారి, సూర్య ప్రకాష్ ఆచారి తెలిపారు. అదే విధంగా త్వరలో జిల్లా నూతన కార్యవర్గ కమిటీ, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కార్యవర్గ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం జిల్లా స్థాయి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు నాగయ్య ఆచారి, కృష్ణమాచారి, వడ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఔషధాలకు ప్రాచుర్యం కల్పించాలి



ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆయుర్వేద ఔషధాలకు ప్రాచుర్యం కల్పించాలని ప్రముఖ వైద్యుడు కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశంలో ఆయుర్వేద వైద్యం ఎక్కువ ప్రాచుర్యం పొందిందన్నారు. వంటింటి పసుపు, మొదలు పెరటి మొక్కల వరకు ఔషధం విలువలు కలిగినవన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు చిన్నపురెడ్డి, సుబ్బయ్య, నాగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 38మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో సింక్రియన్ కన్సల్టింగ్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కమ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 38 మంది విద్యార్థులు ఎంపికై నట్లు ప్లేస్‌మెంట్ అధికారులు ఈవీఎస్ కుమార్, ఎస్.కుమార్ తెలిపారు. ఆదివారం జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 164 మంది విద్యార్థులు హాజరు కాగా మొదటి రౌండ్‌లో 82 మంది అర్హత సాధించి చివరగా 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు తెలిపారు. వార్షిక వేతనం 1.75 లక్షల రూపాయలు కల్పించబడుతుందన్నారు.

దేవస్థానానికి ఎలక్ట్రికల్ ఢమరుకాల వితరణ



ఢమరుకాలను పరిశీలిస్తున్న వేదపండితులు రవిశంకర అవధాని

మహానంది: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన సబ్బసాని శివకుమారి, కుటుంబ సభ్యులు మహానంది దేవస్థానానికి రెండు ఎలక్ట్రికల్ ఢమరుకాలను విరాళంగా అందించారు. ఈ మేరకు వారు ఆదివారం దేవస్థానానికి చేరుకుని స్థానిక యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధానిని కలిసి వాటిని అందజేశారు. దాతలకు ఆలయ పండితులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

పీఆర్సీని నియమించాలి

కోవెలకుంట్ల: వేతన సవరణ సంఘం(పీఆర్సీ)ని నియమించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. దీపావళి కానుకగా ఒక డీఏ ప్రకటించడం హర్షనీయమని, అయితే పీఆర్సీని ని యమించకపోవడం బాధాకరమన్నారు. ఇతర డిమాండ్లను కూడా నెరవేర్చాలని కోరారు.

రబీలో పప్పు శనగ సాగయ్యేనా?

- నియోజకవర్గంలో 17,076 హెక్టార్లలో సాగు లక్ష్యం
- వెంటాడుతున్న వర్షాలు
- ముందుకు సాగని వ్యవసాయ పనులు



తడి ఆరని పొలాలు



పొలాన్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతన్న

ఉయ్యాలవాడ: రబీ సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా, ఉయ్యాలవాడ, రుద్రవరం, చాగలమర్రి, దొర్నిపాడు, ఆళ్లగడ్డ మండలాల్లో శనగ పంట సాగుకు వర్షాలు అడ్డంకిగా మారాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 17,076 హెక్టార్లు కాగా ఉయ్యాలవాడలోనే అత్యధికంగా 12,700 హెక్టార్లలో శనగ పంట సాగు చేయాల్సి ఉంది. ఈ ఏడాది బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా నెల రోజులుగా విరామం లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు రసాయనిక ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్నా, భూమిలో తేమ అధికంగా ఉండడంతో సాగు ప్రారంభించలేక ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో శనగ విత్తనాలు క్వింటా రూ.5,600 ఉండగా, ప్రభుత్వం సబ్సిడీ ధర రూ.5,850గా ప్రకటించింది. ఒకవైపు రసాయన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు విత్తనాలు పొందేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇక ఎకరాకు 2 బస్తాలు డీఏపీ ఎరువులు భూమిలో వేయాల్సి ఉంది. గత కొన్నేళ్లుగా డీఏపీ లభ్యమయినప్పటికీ ఈ సీజన్‌లో అందుబాటులో లేకపోవడం, రైతుల ఆవేదనను పెంచుతోంది. అనుకూలించని వాతావరణం, అధిక తేమ, తిరిగి వర్షాల అవకాశం కారణంగా రబీ సీజన్‌లో శనగ పంట సాగుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ప్రతి ఏడాది దసరా పండుగ అనంతరం సాగు ప్రారంభించే రైతులకు ఈ సంవత్సరం పెద్ద అవరోధాలు ఎదురవుతున్నాయి.

నియోజకవర్గంలో గత ఏడాది సాగు వివరాలు

మండలం	హెక్టార్లు
ఉయ్యాలవాడ	12,148
దొర్నిపాడు	2,761
చాగలమర్రి	1,085
ఆళ్లగడ్డ	985
రుద్రవరం	410
శిరివెళ్ల	--

ఎరువులు దొరకడం లేదు



ఈ ఏడాది రబీలో తెల్ల శనగ 10 ఎకరాలు, ఎర్ర శనగ జేజీ-11 రకం 20 ఎకరాల్లో సాగు చేయాలనుకున్నాను. ఇప్పటి వరకు రైతులకు అవసరమైన రసాయన ఎరువులు అందుబాటులో లేవు. ఎక్కువ శాతం గోదావరి డీఏపీని వాడుతుంటాం. గత ప్రభుత్వంలో సాగుకు ముందే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో వుండేవి. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు లేకపోవడంతో ఏం చేయాలో తోచడం లేదు.

–ముసాని శివానందరెడ్డి, రైతు, ఉయ్యాలవాడ

50 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి



ఈ ఏడాది పప్పు శనగ సాగుకు ప్రభుత్వం 20 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను సరఫరా చేస్తోంది. మార్కెట్‌లో క్వింటా రూ. 5,600కు లభిస్తున్నాయి. సబ్సిడీ విత్తనాలు క్వింటా రూ. 5,850లకు ఇస్తున్నారు. 10 ఎకరాల్లో సొంత పొలం, మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని శనగ పంట సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం అందించే శనగలు మార్కెట్‌లో కన్నా రూ. 250 అధికాంగా ఉంది. 50 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేసి శనగ రైతులను ఆదుకోవాలి.

–గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెద్దయమ్మనూరు

పోరాటాలకు సిద్ధం కావాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రజల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పట్టణ పౌర సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ బాబురావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ పౌర సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీహెచ్ బాబురావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, సూపర్ సిక్స్ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో చామకాల్వ, మద్దిలేరు, కుందూనది వాగుల వెంట రక్షణ గోడను నిర్మించక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంఘాల జిల్లా నాయకులు ఏసురత్నం, లక్ష్మణ్, నరసింహులు, వెంకటలింగం, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ట పూజలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు వేదపండితుడు ఆలూరి నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రాణప్రతిష్ట చేశారు. దాతల సహకారంతో రూ.75 వేలతో ఉత్సవ విగ్రహాలను తయారు చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రాణ ప్రతిష్ట చేసి సంప్రోక్షణ చేశారు. కార్తీక పౌర్ణమి రోజున ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహిస్తామని నరసింహ ప్రసాద్ తెలిపారు. సర్పంచ్ శివరాముడు, భక్తులు జయరాముడు, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పాటు



ప్రజా పర్యవేక్షణ కమిటీ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పేద ప్రజల అభ్యున్నతికి ప్రజా పర్యవేక్షణ కమిటీ తోడ్పాటునందిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా పర్యవేక్షణ కమిటీ, ల్యాంప్ సంస్థ అధ్యక్షుడు సాల్మాన్‌పాల్, కో ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. ఆదివారం నూనెపల్లెలోని ఆంధ్రప్రదేశ్ ప్రజా పర్యవేక్షణ కమిటీ కార్యాలయంలో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సమావేశం జరిగింది. సమావేశంలో సాల్మాన్‌పాల్ మాట్లాడుతూ నంద్యాలలో ఒక్కసారిగా స్వచ్ఛంద సంస్థలు ఒకే చోట హాజరు కావడం అభినందనీయమన్నారు. పేద ప్రజల అభివృద్ధి కొరకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు సహకరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు అధికారుల సహకారంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామేలు, సుబ్బరాయుడు, బర్నాబాస్, మస్తాన్‌వలి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షనర్ల వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌టీటీఎఫ్ కార్యాలయ ఆవరణలో ఎస్‌టీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.25వేల కోట్ల బకాయిలలో 6వేల కోట్లు మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించిందన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము అవసరం మేరకు మంజూరు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్, కార్యదర్శి రామకృష్ణ, సురేష్, నంద్యాల గౌరవాధ్యక్షుడు కేషాలు నాయక్, అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్య వాద పన్నుల విధానం ప్రమాదకరం



మాట్లాడుతున్న మరియదాసు

నంద్యాల(న్యూటౌన్): సామ్రాజ్య వాద పన్నుల విధానం ప్రపంచ దేశాలకు తీవ్ర ప్రమాదమని బేతంచెర్ల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ నిర్వహణపై అధ్యక్షుడు పీవీ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మరియదాసు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పన్నుల విధానం.. భారతదేశంపై దాని ప్రభావం గురించి వివరించారు. భారతదేశం వంటి మిత్ర దేశాలపైన కూడా భారీ సుంకాల వేటుకు పూనుకున్నాడని, దీని వల్ల భారతీయ ప్రముఖ రంగాలైన వస్త్ర పరిశ్రమ, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, చేనేత, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రామకృష్ణుడు, నరసింహారెడ్డి, అరవింద్, ప్రిన్సిపాల్ మల్లికార్జునప్ప, సోమన్న, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక జగన్ ఆర్థో ఆసుపత్రి డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉచిత వైద్య శిబిరానికి హైదరాబాద్‌కు చెందిన అపోలో ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్‌రెడ్డి, కేన్స్ ఆసుపత్రి ఎండీ న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య హాజరై జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు, రిటైర్డు పెన్షనర్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మోహన్‌రెడ్డి, విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పీఆర్‌టీయూ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, భాస్కరరెడ్డి, సుమయూన్, హుసేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. ఈ మేరకు పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని రుద్రగుండం (పెద్ద కోనేరు), రెండు చిన్న కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు ఉచిత, శీఘ్రదర్శనం ఆర్జిత సేవాటికెట్లతో పాటు అభిషేకం, మహదాశీర్వచనం సేవా టికెట్ల ద్వారా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో ఏకాంతసేవ పూజలు జరిపారు. భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు.



చిన్నకోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

నంద్యాల: వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరా ఆదివారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ పర్వదినాన్ని సురక్షితంగా జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సూచించారు.

భూమిపై పూర్తి హక్కు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): ఏ కోడూరు చిన్న చెరువు భూమిపై అనుభవంలో ఉన్న పేదలకు ప్రభుత్వం పూర్తి హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్, ఉపాధ్యక్షుడు డేవిడ్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ.కోడూరు గ్రామంలో భూమి లేని నిరుపేదలు ఎస్సీ, బీసీ వారు గత 50 సంవత్సరాలుగా చిన్న చెరువు భూమిలో వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. చిన్నచెరువు భూమిని ప్రభుత్వం డెవలప్‌మెంట్‌కు తీసుకున్నా అనుభవంలో ఉన్న రైతులకు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. లేని పక్షంలో నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యులు చెన్నయ్య, కృష్ణ, రత్నమయ్య, మధుశేఖర్, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయదారులపై కేసు నమోదు

గోస్పాడు: ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులను విక్రయిస్తున్న ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన గోస్పాడులో మిరియాల హరీష్ బాబు, మిరియాల శ్రీనివాసులు, డేగల వెంకటేశ్వర్లు దీపావళి సందర్భంగా టపాసులను విక్రయించేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు నిల్వచేసుకుని, అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.10వేలు విలువచేసే టపాసులను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన నాగేశ్వరరావు

మహానంది: బుక్కాపురం గ్రామంలోని పాదుపు భవనం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పంట పొలాల నుంచి వస్తున్న ఓ బైకును తప్పించబోగా ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఒక బైక్‌పై తమ్మడపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, మరో బైకుపై నాగేంద్ర వస్తున్నారు. అయితే సమీపంలోని పంట పొలాల నుంచి మరో వ్యక్తి బైకు మీద వస్తుండగా ఆయనను తప్పించబోయిన రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు



బేతంచెర్ల: దేవతలు ముచ్చటపడి భూలోకంలో నెలకొల్పిన ఆలయంగా ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

ఇక్కడ ముక్కోటి దేవతలు శివలింగ ప్రతిష్టాపన చేశారని భక్తుల నమ్మకం. మరికొన్ని కథనాల ప్రకారం, అగస్త్య మహాముని శివలింగ ప్రతిష్టాపన చేయగా జనమేజయుడు ఆలయాన్ని నిర్మించినట్లు భావిస్తారు. శ్రీశైల మల్లికార్జున స్వామి అంశే ఇక్కడ స్వయంభు లింగంగా వెలసినది అని నమ్ముతారు. ప్రతి సోమవారం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయ గోపుర నిర్మాణం శ్రీకృష్ణదేవరాయులు కాలంలో నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. 2022లో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఆలయానికి 3 కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. 2024లో గాలి గోపురం పునరుద్ధరణ, గ్రానైట్ ఫ్లోరింగ్, కోనేరు, రథశాల నిర్మాణానికి రూ.1.90 కోట్ల నిధులు మంజూరు చేసి భూమిపూజ నిర్వహించగా, తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కళ్యాణమండపం పనులు ప్రారంభించగా, మూడు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశాడు.

నిమిషాల్లో కోరికలు తీర్చే నిమిషాంబాదేవి





భక్తులకు రాగి నాణేలను అందజేస్తున్న సంఘం నాయకులు, ప్రత్యేక అలంకారంలో నిమిషాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పార్కు రోడ్డులో శ్రీ నిమిషాంబ ఆలయంలో ధన త్రయోదశిని పురస్కరించుకొని ఆదివారం ఆర్య చిత్తారి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా నవరాత్రుల్లో పూజలు నిర్వహించిన అమ్మవారి ప్రతిమ గల రాగి నాణేలను వందలాది మంది భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో అశోక్, మాధవ, కుమార్, సురేష్, నాగరాజు, సాయివర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యాయామ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2025 మెగా డీఎస్సీలో ఎంపికై న అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను ఆదివారం నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీరెడ్డి, ఎంఈఓ సుబ్రమణ్యం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విశ్వనాథ్‌లు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్‌గా వెలుగోడు జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న రంగన్నను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, సురేష్ నాయుడు, చంద్రావతమ్మ, లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: గ్రామాల్లో గొడవలకు పాల్పడటం, వర్గాల మధ్య రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గోపవరం గ్రామంలో ఆదివారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమానితుల ఇళ్లల్లో తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులు ఇంట్లో 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామంలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బైకులు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.